




# ఆ రాత్రి

(ఏకాంకిక)

వేములకొండ రమణ






యువతి: (ఉడికిస్తూ) కోతీ బావకు పెళ్ళంటా, కోవెల తోటా విడిదంటా (అని పాడి) వండర్ ఫుల్! మారవి బావగారు చూడ ముచ్చటగానే అట్టే పెట్టుకుంటారే గది! (నవ్వింది)

రవి: (నవ్వు తెచ్చిపెట్టుకుంటూ) అతిథి దేవు ళ్ళొచ్చినట్టున్నారునే గదిలో లేనప్పుడు. (అంటూ మెల్లగా బ్రీఫ్‌కే‌స్ తీశాడు)

యువతి: అతిథి దేవుళ్ళా!? నువ్వు లేనప్పుడా?!

రవి: (బ్రీఫ్‌కే‌స్ సర్ది, వార్డ్‌రోబ్‌లో పెడుతూ) పోనీ బర్గ్లర్స్...దొంగలే అనుకో, రాధా!

రాధ: (ఆశ్చర్యపోతూ) దొంగలు పడితే అలా చీకూ చింతా లేకుండా ఉన్నా వేమిటి, బావా, వెంట నే మానేజర్‌ని పిలిచి కంప్లయింట్ ఇవ్వక?

రవి: (పడి ఉన్న బట్టలు ఏరి వార్డ్‌రోబ్‌లో పెడు తూ) డబ్బూ దస్కం ఏం ఉండవు నా దగ్గ ర-పోడానికి, బాధపడడానికి. (నవ్వుతూ చూశా డు రాధని.)

రాధ: (శ్రుతి కలుపుతూ) ఆ సంగతి వచ్చిందాకా వాళ్ళకూ తెలిసుండదు. పాపం! ప్రొద్దునే ఎవరి ముఖం చూశాంరా అని తిట్టుకుంటూ పోయుంటారు...పూర్ చాప్స్...ఐ పిటీ దెమ్.

రవి: (నవ్వుతూ) దిస్ రిమైండ్స్ మీ ఆఫ్ ఎ కల్‌కటా జోక్. (కాస్త బిగ్గరగానే నవ్వాడు.)

రాధ: డోన్ట్ బి సో సెల్ఫిష్...ఆ జో కేదో నాకూ సెలవి స్తే నేనూ ఆనందిస్తాగా.

రవి: (నవ్వు ఆపుకుంటూ) కొత్తగా కలకత్తా చేరుకు న్న ఓ ఇద్దరు మిత్రులు అర్ధరాత్రి నైట్ క్లబ్‌నుండి దిగబడి ఓ టాక్సీ ఎక్కారట... నిరామయమయిన ఓ వీధిలో హఠాత్తుగా టాక్సీ ఆపి, మొల్లోంచి కత్తి తీశాడట ఆ టాక్సీ డ్రైవర్... అదను చూసి ఒకడు పరుగు లంకించుకోగా, రెండవ వాడు దొరికి పోయా డట ఆ డ్రైవర్ చేతికి... పాపం! ఎంత గాలించి నా ఆ మిత్రుడి జేబులో పైసాకూడా దొరకలే దట ఆ టాక్సీ వాడికి. కనీసం వాచీకూడా లేదట వాడి చేతికి. దాంతో వాడికి ఒళ్ళు మండి ఆ మిత్రుణ్ణి నాల్గు గుద్దులు గుద్ది ఓ ఉచిత సలహా ఇచ్చాడట.

రాధ: (వచ్చే నవ్వును ఆపుకుంటూ) సలహావా? యు మీన్ ఫ్రీ యడ్వయిజ్? ఏమిటో అది?

రవి: (సీరియస్‌గా) ఎప్పుడు టాక్సీ ఎక్కినా కనీసం ఓ వంద జేబులో ఉంచుకోమని. (నవ్వేశాడు)

రాధ: (నవ్వకుండా ఉండలేకపోయింది) పాపం! ఆ రాత్రి ఆ టాక్సీ వాడికి షేరుకూడా గిట్టనట్లు, ఈ రాత్రి నీ అతిథులకు వృథా ప్రయాసే అయింది.

(రాధ పై డైలాగు చెబుతుంటే, కిటికీ వద్దకు వెళ్ళి బయటకు పరీక్షగా చూస్తుంటాడు రవి)

రాధ: అయినా, ఊరంతా గొడ్డు పోయినట్లు, ఈ హెటల్ ఎక్కడ దొరికింది, బావా, నీకు?

రవి: (కిటికీ వద్దనుండే) చెప్పాగా, రాధా! ఓ అర్జెంటు పనిమీద వచ్చాను. అందుకే ఇక్కడ దిగవలసి వచ్చింది. (మళ్ళీ కిటికీ లోంచి చూడసాగాడు)

రాధ: ఈ కబుర్లకేం గాని, ముందు సామాన్లు పాక్ చేయి. ఇంటికి పోదాం.

రవి: (రాధ వైపు రెండడుగులు వేసి) ఇప్పుడు రావడానికి పడదు... ఎక్స్‌క్యూజ్ మీ.

రాధ: అదేం కుదరదు. అయినా, అర్ధరాత్రి పనులే మి టబ్బా నిశాచరుడిలా?

రవి: సారీ, రాధా! నా పనేమిటో ఇప్పుడు చెప్పలే ను... చెప్పినా నువ్వు నమ్మలేవు... ప్లీజ్! డోంట్ కంపెల్ మీ. (మళ్ళీ కిటికీ దగ్గర కెళ్ళాడు)

రాధ: (చిరుకోపంతో) అవున్లే! నీ సీక్రెట్స్ తెలుసు కోడానికి నే నెవర్ని మధ్య? (ఉడుకుమోత్త నంతో) ఉందిగా నీ అత్త కూతురు. ఆ రాణీగా రి ఊరైతే, వాళ్ళింట్లోనే దిగుతావు.

రవి: (ఇంకా కిటికీలోంచి చూస్తూనే) రాధా!... ప్లీజ్! బిలీవ్ మీ...మీ. ఇంటికి రాలేక పోవడానికి కారణం నిజంగా...

రాధ: (అలుగుతూ) నువ్వేం చెప్పఖ్ఖరలేదు. నే నేదో యాక్సిడెంటల్‌గా ఆబిడ్స్‌లో ఎదురయ్యాను గనక లేనిపోని కబుర్లు చెబుతున్నావు. ఎక్కడ లేని ప్రేమ ఒలకబోస్తున్నావు. నీ సంగతి ఎవరికి తెలీదు?

రవి: రాధా! ప్లీజ్ లిసన్ టు మీ. (రాధ వైపు రెండడుగులు వేసి) ఓ సంగతి చెప్తా-నమ్ము తావా?

రాధ: (ఆశగా చూసింది ఏమిటన్నట్లు)

రవి: మొన్న మామయ్య ఢిల్లీ వచ్చినప్పుడు ఏం చెప్పానో తెలుసా? (రాధ ముఖం రెండు చేతు ల్తో పైకి ఎత్తి, ఆమె కళ్ళలోకి చూస్తూ) "రాధ నా భార్య, మామయ్యా" అన్నాను-తెలుసా?

రాధ: (తన్మయురాలై) బావా! (అంటూ రవి గుండె పై వ్రాలింది)

రవి: (రాధ ముంగురులు సవరిస్తూ) నిజం, రాధా! నన్ను నమ్ము. (చటుక్కున రాధను వదిలి, కిటికీ వైపు వెళుతూ) ఇంక నా విషయంలో అనుమానాలు, అపోహలు పెట్టుకోకు. ఏం? (బయటకు తీక్షంగా చూస్తుంటాడు)

రాధ: (మళ్ళీ రవి ప్రవర్తనలోని మార్పుకు కాస్తంత ఆశ్చర్యపోయినా, మామూలుగానే అంది) మరి మాఇంట్లో ఎందుకు దిగలేదు? (రవి దగ్గరగా వెళ్ళి) నన్ను చూడాలని నీ కనిపించలేదా?

రవి: (రాధ వైపు తిరక్కుండానే) చెప్పానుగా అతి ముఖ్యమయిన పనిమీద తిరుగుతున్నానని. (ఒక్కసారిగా అడుగు వెనక్కు వేస్తూ) అరే! వచ్చేశాడే!

రాధ: (ఖంగు తింది) ఎవరు, బావా?... రావడమే మిటి?

రవి: (ఇంకా కిటికీలోంచి దృష్టి తిప్పకుండానే) ఆc!... అహc!... ఏం లేదు.

రాధ: ఏం లేకపోవడమేమిటి?... అసలు వచ్చిం దగ్గర నుంచి ఎందు కలా కిటికీలోంచి చూస్తు న్నావు?

రవి: (ఏదో చెప్పబోయి ఆగాడు. మరోసారి కిటికీ లోంచి చూస్తూ) నా ఉద్యోగం గురించి మామ య్య నీకు చెప్పలేదా, రాధా?

రాధ: (అమాయకంగా) చెప్పాడు. కాని నువ్వు కిటికీ లోంచి చూడ్డానికి, నీ ఉద్యోగానికి సంబంధం?

రవి: అదే... ఏమని చెప్పాడు?

రాధ: నువ్వు... సెంట్రల్ గవర్నమెంటులో ఆఫీస ర్ అని.

రవి: అంతేనా? (వెనుతిరిగి రాధ వైపు అడుగులు వేస్తూ) అంటే, నా ఉద్యోగం గురించి నీ కేం తెలీదన్న మాట. ఐయామ్ ఇన్ సి.బి.ఐ... ఉద్యోగరీత్యా-అంటే దేశ క్షేమం, దేశ రక్షణ దృష్ట్యా-తరుచు పులి నోట్లో తల దూర్చవల సి వస్తూ ఉంటుంది. (చటుక్కున వెనుతిరిగి మళ్ళీ కిటికీ దగ్గర కెళ్ళాడు) ఐ థింక్ దిస్ ఈజ్ ఫైనల్... వీడి మూవ్‌మెంట్స్ చాలా తమాషాగా ఉన్నాయి ఈ రాత్రి... అంటే, ఈ రాత్రి వాడు తన పని పూర్తి చేయబోతున్నా డన్న మాట.

రాధ: (అయోమయంగా) ఎవరు, బావా, అది?

రవి: (రాధ మాటలు వినపడనట్టే తనలో తను మాట్లాడుకుంటున్నట్లు) ఐ మస్ట్ డూ సంథింగ్ క్విక్. (వేళ్ళు విరుచుకుంటూ) తప్పక చేయాలి ఏదో త్వరగా. (కణతలు వేళ్ళతో నొక్కుకుంటాడు)

రాధ: చెప్పు, బావా, చంపక!... ఎవడు వాడు?

రవి: (అన్యాపదేశంగా) మాతృదేశ క్షేమాన్ని అమ్ము కునే ఓ చీడ పురుగు. (ఒక్కసారిగా రాధ వైపు తిరిగి, ఆవేశంతో రాధ భుజాలు పట్టుకొని) ఓ చిన్న పని చేస్తావా, రాధా?

రాధ: (ఆనందంగా) ష్యూర్!... ఏం చెయ్యాలో చెప్పు, బావా!




రవి: ఇలా రా. (అంటూ రాధను కిటికీ దగ్గరగా తీసుకెళ్ళి, కర్టెన్ ఇంకాస్త పక్కకు తప్పించి, బయటకు చూపుతూ) తెరిచున్న ఆ కిటికీ కనపడుతుందా?... అదే వాడుండే గది. రూమ్ నంబర్ 311. (మళ్ళీ వెనక్కు తిరిగి రెండడుగులు వేస్తూ) ప్రస్తుతం వాడి పేరు ప్రతాప్. అనేక భాషలు అనర్గళంగా మాట్లాడగలడు. వాడి దగ్గర మన దేశ రహస్యపత్రాలు ఉన్నాయి. అవి మన దేశ హద్దులు దాటక ముందే వాటిని నేను సంపాదించాలి... నువ్వే సాయం చేస్తే, నే నది సాధించగలను.

రాధ: (రవి దగ్గరగా వెళ్ళి) ఏమిటి, బావా! సాయం, సాయం అంటూ ఊరికే నానుస్తున్నావు... ఏం చేయాలో త్వరగా చెప్పు...ఊఁ... కమాన్... ఎందుకు ఆలస్యం?

రవి: (నవ్వుతూ) హోల్డాన్!... హోల్డాన్! కాస్త ఆగు. (అంతలోనే ముఖం సీరియస్‌గా మారింది) నువ్వు చెయ్యవలసింది చెప్పే ముందు నే చేయబోయేది నువ్వు తెలుసుకోడం ముఖ్యం. లేకపోతే నీ సాయం మిస్‌ఫైర్ కావచ్చు. (మళ్ళీ రాధను కిటికీ వద్దకు తీసుకెళ్ళి బయటకు చూపిస్తూ) చూడూ... అదిగో ఆ అంచు... ఏం కనబడుతుందా?... ఆ అంచు మీద వేళ్ళు మోపుకొని, గోడను పట్టుకొని వాడి కిటికీ చేరుకుంటాను.

రాధ: (కెవ్వుమని కేక పెడుతూ మంచం మీద కూలబడింది) ఆర్ యూ క్రేజీ? అంచుమీద నడవటం ఏమిటి, బావా?... మతి గాని పోయిందా నీకు?

రవి: (నీరుకారిపోతూ) అందుకే, రాధా, నువ్వెంత అడిగినా ఇంతవరకూ నా విషయా లేవీ చెప్పంది. ఐయామ్ సారీ! (అంటూ కిటికీ వైపు వెళ్ళాడు)

రాధ: (ఇంకా భయం భయంగా చూస్తూ) అదికాదు, బావా! అన లా అంచు ఎంత ఉందని సర్కస్‌లా దానిమీద రోప్ వాకింగ్ చేయడానికి? కాస్త ఇటూ అటూ గాని అయిందంటే ఇంకేమైనా ఉందా? హండ్రడ్ ఫీట్ ఫాల్! వాడి రూమ్ చేరడం కాదు, భూమ్మీద లాండ్ అవుతావు. తెలిసిందా?

రవి: (అనునయిస్తూ) నా కామాత్రం తెలీదా? ఇప్పుడంతకన్న మరో దారి లేదు.

రాధ: ఎందుకు లేదు?... తిన్నగా వాడి రూమ్ కెళ్ళి తలుపు తట్టవచ్చుగా!

రవి: నో యూజ్... లాభం లేదు. వాణ్ణి ఫాలో అవుతున్నానని వాడికి తెలును. రివాల్వర్ చేత్తో పటుకుని తలుపు తీస్తాడు. వెంటనే నా అక్కౌంట్ సెటిల్ చేసేస్తాడు.

రాధ: (సందిగ్ధంలో పడింది క్షణం. అంతలోనే తేరుకుంటూ) పోనీ, ఏకంగా రెయిడ్ చేయించవచ్చుగా?

రవి: అది పెద్ద బ్లండర్ అవుతుంది. పోలీస్ రెయిడ్ లోపలే తన దగ్గరున్న రహస్య పత్రాలు తగల పెట్టేస్తాడు. వాడు 'స్పై'-గూఢచారి-అని రుజువు చేయడానికి వీల్లేకుండా జాగర్త పడతాడు... అందుకే వాణ్ణి అన్‌వేర్స్‌గా ప్రాణాలతో పట్టుకోవాలి. ఎందుకంటే, వాడే దేశానికి గూఢచారో తెలుసుకోవాలి. వాడి సహచరు లెవరో తెలుసుకోవాలి... అందుకే మూడు రోజులుగా వాణ్ణి వెన్నాడుతూ ఇంత దూరం వచ్చాను.

రాధ: కాని, బావా! నువ్వలా వెళ్ళడం డేంజర్స్... ఇంపాసిబుల్... ఐ వోన్ట్ అగ్రీ... నే నొప్పుకోను.

రవి: రాధా! ప్లీజ్ బి ఎ గుడ్ గర్ల్. గొడవ చెయ్యక నే చెప్పింది విను. నేను ఆ గోడను ఆనుకొని, అంచుమీదుగా మెల్లగా ఆ గది కిటికీ చేరుకుంటాను. అంతవరకు నువ్విక్కడే ఉండి చూస్తుండాలి.

రాధ: వాట్? చూస్తుండాలా? ఐ జస్ట్ కాన్ట్ డూ దట్... నువ్వు నొప్పులో దూకుతుంటే నే చూస్తూండాలా? ఏమిటి, బావా, నువ్వు చెప్పేది? అర్థం లేకుండా?

రవి: (తీక్షణంగా చూస్తూ) రాధా! డోన్ట్ వేస్ట్ మై టైమ్. ఇలా జాప్యం చేస్తూ కూర్చుంటే మొదటికే ముప్పు రావచ్చు. సర్వ నాశనం కావచ్చు నా మిషన్. దటీజ్ వై ఐ వాంట్ దట్. యు మస్ట్ హియర్ మీ...నేను వాడి గది కిటికీ చేరుకోగానే నువ్వు గబగబా వెళ్ళి వాడి గది తలుపు తట్టు. తలుపు తెరవగానే...

రాధ: తలుపు తెరవక పోతేనో?

రవి: తప్పకుండా తీస్తాడు. యునో వై? హి ఈజ్ ఎక్స్‌పెక్టింగ్ హిజ్ కాంటాక్ట్ మన్ టు నైట్... ఎవరి కయితే తన దగ్గరున్న రహస్య పత్రాలు అందించాలో వా డీ రోజు తప్పక వస్తాడని నా నమ్మకం. అందుకనేమో ఈ ప్రతాప్‌గాడు సాయంత్రం నుండి ఇక్కడి కిక్కడే తచ్చాడుతున్నాడే గాని, ఊరిమీద పడటం లేదు.

రాధ: సరే, వాడు తలుపు తీశాక నే నేం చేయాలి?

రవి: వాడు తలుపు తీయగానే స్వీట్ స్మైల్ ఒకటి పడేయ్. అయిసయిపోతాడు. ఎందుకంటే, ఆడవాళ్ళే వాడి కున్న పెద్ద వీక్నెస్ అల్లా.

రాధ: ఈజ్ ఇట్ సో? దెన్ దేర్ ఈజ్ నో ప్రాబ్లెమ్!...నేను వెళ్ళి వాణ్ణి ఏ సినిమాకో, నైట్ క్లబ్‌కో తీసుకుపోతాను. అప్పుడు నువ్వెళ్ళి సావకాశంగా వాడి రూమ్ సోదా చెయ్యి. అప్పుడు నీ కా ప్రమాదం, బాధ ఉండదు. నో రిస్కింగ్ ఆఫ్ లైఫ్ బిజినెస్!

రవి: ఇట్స్ నాట్ దట్ ఈజీ? ప్రతాప్ ఆవలిస్తే పేగులు లెఖ్ఖ పెట్టే రకం. అంత సులువు కాదు వాడిని దారి మళ్ళించడం... అసలు వాడా సీక్రెట్ డాక్యుమెంట్స్ రూమ్‌లో వదేసి తిరుగుతా డనుకోను. దట్ ఈజ్ వై యు హావ్ బెటర్ ఫాలో మై అడ్వయిజ్. తలుపు తీయగానే "మిస్టర్ ప్రకాష్, ప్లీజ్" అను. "ఇక్క డుండేది ప్రకాష్ కాదు, ప్రతాప్" అంటాడు. రిసెప్షన్‌లో రాంగ్ రూమ్ నంబరు ఇచ్చినట్లు నటించు. "సారీ" అని త్వరత్వరగా హొటల్లోంచి వెళ్ళిపో-తిన్నగా మీ ఇంటి కెళ్ళిపో. నా రూమ్‌కి రావద్దు. అండర్ స్టాండ్?

రాధ: నిన్నొదిలేశా? ఈ పరిస్థితిలో... మరి నువ్వో?

రవి: డోన్ట్ వర్రీ అబౌట్ మీ... నువ్వు వాడి అటెంషన్ డైవర్ట్ చేసే ఆ కొద్ది క్షణాలు చాలు-నేను వాడి గదిలో దూరి, వాణ్ణి అటాక్ చేయడానికి.

రాధ: (సాలోచనగా నిలబడింది కొద్ది క్షణాలు) మరి మా ఇంటికి ఎప్పుడు వస్తావ్, బావా?

రవి: ఐ డోంట్ థింక్ ఐ కెన్ మేక్ ఇట్ దిస్ టైమ్. ఎనీవే గివ్‌మీ యువర్ అడ్రస్.

రాధ: (వానిటీ బాగ్ తెరిచి కాగితం, కలం వెతకబోతుంది)

రవి: అడ్రస్ చెప్పమంటే ఏమిటి అలా నిలబడి పోయావ్?

రాధ: కాగితం కోసం చూస్తున్నా, బావా. అడ్రస్ రాసివ్వాలిగా!

రవి: నాట్ నెససరీ... అవసరం లేదు. నోటితో చెప్పు చాలు.

రాధ: (ఆశ్చర్యపోతూ) గుర్తుంటుందా?


రవి: ఇంత సింపుల్ థింగ్స్‌కూడా గుర్తుంచుకోలేకపోతే ఇంక ఈ ప్రొఫెషన్‌కే పనికి రాను. కమాన్... కమౌట్ విదిట్- క్విక్.

రాధ: (నెమ్మదిగా స్పష్టంగా చెప్పసాగింది) 16-11-927, అమృత్ మంజిల్, మలక్‌పేట.

రవి: థాంక్స్... (అంటూ వెళ్ళి టేబిల్ లాంప్ వెలిగించాడు. తిన్నగా వెళ్ళి స్విచ్ బోర్డుపై, చెయ్యి వేసి) సందేహిస్తున్నా వేమిటి? ఏం... మీ అడ్రస్ గుర్తుందో లేదో అనా?

రాధ: (సందేహిస్తూ చూసింది రవిని)

రవి: (నవ్వుతూ) 16-11-927, అమృత మంజిల్, మలక్‌పేట్. ఏం? ఆమ్ ఐ కరెక్ట్?




రాధ: (కళ్ళు ఆనందంతో మెరుస్తుండగా) బావా!

రవి: ఓ... టేక్ ఇట్ ఈజీ. (రూమ్ లైటు ఆఫ్ చేశాడు)

(రంగస్థలంలో ఇప్పుడు టేబుల్ లాంప్ మాత్ర మే ప్రకాశాన్నిస్తూ ఉంటుంది.)

రవి: (కిటికీ వద్ద కెళ్ళి, దగ్గరే ఉన్న మంచం ఎక్కి నిలబడి, కిటికీలోంచి బయటపోయే పొజిషన్ చూసుకున్నాడు. వెను తిరిగి) విష్ మీ గుడ్ లక్, రాధా!

రాధ: (చెమర్చే కళ్ళతో, వణకుతున్న కంఠంతో) ఆల్ ది బెస్ట్ టు యూ, బావా!

రవి: థాంక్స్ ఎ లాట్! (అంటూనే మెలమెల్లగా కిటికీ లోంచి మాయ మవుతాడు)

(భయాందోళనలతో నిండిన చూపుల్తో, భారమైన హృదయంతో కిటికీ దగ్గరగా వెళ్ళి రవిని ఫాలో అవుతుంటుంది రాధ. మధ్య మధ్య భయంతో అరవబోయి నోరు నొక్కుకుంటుంది. మూలుగు మాత్రమే సన్నగా వినిపిస్తూ ఉంటుంది. రెండు మూడు నిమిషాల పాటు ప్రదర్శించబడే రాధ హావభావాలు, ముఖ కవళికలు, కదలికలు, చేష్టలు, మూలుగులు ఆదిగా గల నటనా భంగిమలు, రవి ఎంత ప్రమాద పరిస్థితిలో ఇరుక్కున్నది చెప్పక చెప్తూ, ప్రేక్షకులలో ఓ విధమైన భయభ్రాంతిని, టెన్షన్ని, రవి పట్ల జాలిని పుట్టించ గలగాలి.) *

రవి నిష్క్రమించిన కొద్ది క్షణాలకు వరండా ఫ్లష్ డోర్ చప్పుడు కాకుండా మెల్లగా తెరుచుకుంది. మెల్లగా ఒక వ్యక్తి ప్రవేశించి, అడుగులో అడుగు వేస్తూ రాధ వద్దకు వెళ్ళి వెనుకమాటుగా ఆమె నోరు నొక్కి, రెక్కలు వెనక్కు విరిచి, ఆమె నోటికి ప్లాస్టర్ అతికించి, కొట్టుకుంటున్న ఆమె కాళ్ళనీ, చేతుల్నీ నైలాన్ రోప్తో కట్టి, ఆమెను మంచం పైకి త్రోసివేస్తాడు.

(రాధ అరవలేక పెనుగులాడ లేకపోయినా ఆమె గింజుకుంటున్నదని ఆమె శరీరక కదలికల వల్ల తెలుస్తుంటుంది.)

* పై సన్నివేశం జరుగుతున్నంత సేపూ ఏ విధమైన నేపథ్య సంగీతమూ ఉండకూడదు. ఒక్క గోడ గడియారం చేసే "టిక్, టిక్" శబ్దం తప్ప. ఈ శబ్దం రవి నిష్క్రమించగానే ప్రారంభమై, అంచెలంచెలుగా హెచ్చుతూ ప్రతాప్ ప్రవేశించి రాధని అటాక్ చేసేసరికి తారస్థాయిని అందుకుంటుంది. రంగస్థలంపై గోడ గడియారం చూపవలసిన ఆగత్యం లేదు.

వ్యక్తి: (చేతులు దులుపుకుంటూ) దట్స్ గుడ్! ప్రస్తుతానికి ఇది చాలు. (కిటికీ తెర కాస్త పక్కకు తొలగించి, మెల్లగా బయటకు చూసి, మంచం దగ్గరకు వస్తూ) అఫ్ కోర్స్, ఆడవాళ్ళను హింసించడం, ముఖ్యంగా నీ లాంటి బ్యూటీని బాధ పెట్టడం నా మతానికే విరుద్ధం. కానీ, తప్పలేదు. (వంగి రాధ బుగ్గమీద చిటికె వేస్తాడు)

రాధ: (గింజుకుంటుంది)

వ్యక్తి: కాస్త ఓపిక పడితే నేనెంత మంచివాడనో, ఎంత రసికుడనో నీకే తెలుస్తుంది. (మళ్ళీ కిటికీ వద్దకు వెళ్ళి, బయటకు తొంగి చూసి) మొత్తానికి నా యాల, నా గది చేరుకున్నాడు. అసాధ్యుడే! (రాధకు కాస్త దగ్గరగా వచ్చి) కాని, నేను మాత్రం వీడు ఒఠ్ఠి ఫూల్ అంటాను. లక్ష రూపాయ లిచ్చినా ఇలాంటి డేంజరస్ పని-ప్రాణం రిస్కులో పడేసే పని-మాత్రం ఈ ప్రతాప్ చస్తే ఒప్పుకోడు... మూడు అంగుళాలు కూడా లేని అంచుమీద బల్లిలా గోడను కరుచుకుని ప్రాకడం మాటలా?! పట్టు తప్పిందా వాడి పని గోవిందా-గోవిందా కదా! (మళ్ళీ కిటికీ లోంచి బయటకు చూశాడు) ఓర్నీ! నా గదిలోకి కూడా దూరాడే! బుర్ర లేని నాయాల! ఆ గదిలో ఏముందని? (మళ్ళీ రాధ ఉన్న వైపు వచ్చి) నా కామాత్రం బుర్ర లేదనుకున్నాడు ఈ దొంగనాయాల. కిటికీలోంచి దిగగానే కనిపెట్టేశాను నాయాల గాడి అయిడియా... అందుకే ఎత్తుకు పైఎత్తు-ఈ గదిలోకి దూరాను. అఫ్ కోర్స్, నా ఎత్తు ఎంత గొప్ప ఎత్తో ఇక్కడికి తిరిగొచ్చాక గాని తెలుసుకోలేడు నాయాల. టూ బర్డ్స్ ఎట్ వన్ షాట్! నాయాలగాడ్ని పైకి పంపటం -(రాధను తాగేసినట్టు చూస్తూ) నిన్ను నా రూమ్కి తీసుకుపోవటం (-అంటూ రాధ పిర్రమీద చిన్నగా చరిచాడు)

రాధ: (అసహ్యంతో చూస్తూ గింజుకుంటుంది)

ప్రతాప్: డోన్ట్ వర్రీ, బుల్ బుల్! ఇంకో టూ మినిట్స్ బేర్ దిస్ ఏగనీ.

రాధ: (మళ్ళీ గింజుకుంది)

ప్రతాప్: నో ప్రాబ్లెమ్! వాడిస్తే నన్ను దానికి డబుల్ ఇస్తాను. ఒకే! మన సంగతి నీ కింకా కొత్త. (మళ్ళీ కిటికీ వద్ద కెళ్ళి చూశాడు) ఇంకా రావటం లేదేం చెప్మా! నా రూమ్ లాక్ చేసే వచ్చానే! బహుశః రూమ్ అంతా గాలిస్తున్నాడు కాబోలు...పాపం, పిచ్చినాయాల! రూమ్ గాలిస్తే ఏం లాభం? వాడు వెతికేది నా దగ్గరుంటే! (బిగ్గరగా నవ్వాడు)

రాధ: (మళ్ళీ గింజుకుంది)

ప్రతాప్: చూడు, బుల్ బుల్! నువ్వు ఊరికే అలా గింజుకుంటే నాకు జాలి వేస్తుంది. ఇంకా కట్లు విప్పలేదంటే తప్పు నాది కాదు... నాయాల త్వరగా వచ్చుంటే (జేబులోంచి పైనీ రివాల్వర్ తీసి, దాన్ని ముద్దు పెట్టుకొని) వాడి అకౌంటు ఈపాటికి సెటిల్ చేసేసి, మనిద్దరం హాయిగా... (ఒక్కసారిగా మాట్లాడడం ఆపి, కిటికీ దగ్గరకు వెళ్ళి, బయటకు తొంగి చూసి) ఆc!... అద్గదీ... తిరిగొస్తున్నాడు నాయాల! మెల్లగా వాడీ కిటికీ చేరేటప్పటికి (చేతిలోని రివాల్వర్ని మళ్ళీ ముద్దు పెట్టుకుని) సైలెన్సర్ ఫిక్స్ చేసిన ఈ రివాల్వర్ "తుస్" మని తన పని ముగించేస్తుంది గప్ చిప్గా. (అంతలోనే ఏదో అయిడియా, ఫ్లాష్ అయింది బుర్రలో) వీడి పని పూర్తి చేయడానికి రివాల్వర్కూడా ఎందుకు? ఓ బుల్లెట్ వేస్ట్! పులి నోట్లో తల దూర్చిన నాయాల యక్కౌంట్ సెటిల్ చేయాలంటే పులి నోరు మూస్తే పోలా! (రివాల్వర్ జేబులో పెట్టేసి, తన రెండు చేతులు గొప్పగా చూసుకుంటూ) రెండు ఇనప చేతు లుండగా, బుల్లెట్ ఎందుకు మధ్య? (బిగ్గరగా నవ్వుతూ) ఎస్... సింపుల్!... వెరీ సింపుల్! (మళ్ళీ కిటికీ లోంచి చూశాడు. తగ్గు స్వరంతో ) ఆc! వచ్చేస్తున్నాడు... అప్పుడే పక్క రూమ్ దగ్గర కొచ్చేశాడు. (కిటికీకి రెండు అడుగులు వెనకగా వచ్చి తన పొజిషన్ అడ్జస్టు చేసుకుంటూ, రెండు చేతులు ఎత్తి పెట్టి అటాకింగ్ ఫోజు పెట్టి, తగ్గు స్వరంతో) బుల్ బుల్! జస్ట్ వన్ మినిట్! నాయాల చేతులు కిటికీమీద పడట

